కె.ఎస్.ఎస్.ప్రసాద్
యు.టి.ఎఫ్. రాష్ట్ర కార్యదర్శి
తూర్పుగోదావరి జిల్లా

# ఆటోమాటిక్ అడ్వాన్సుమెంటు స్కీము

ప్రమోషనుకు అర్హత కలిగియుండి, తగినన్ని ఖాళీలు లేనందున సకాలంలో ప్రమోషన్లు పొందలేకపోతున్న ఉపాధ్యాయుల కొఱకు 1982 PRC లో ఆటోమాటిక్ అడ్వాన్సుమెంటు స్కీము ప్రవేశపెట్టబడింది. దీని ప్రకారం ఒక (స్కేలు) కేటగిరిలో 10 సంగలు పనిచేసిన వారు స్పెషల్ గ్రేడు పోస్టు స్కేలుకు, 15 సంగలు పనిచేసినవారు తదుపరి ప్రమోషను పోస్టు (SPPI) స్కేలుకు అర్హులు. తర్వాత 1986 PRC లో 22సంగలు పూర్తి చేసిన వారికి SPP-II స్కేలు ప్రవేశ పెట్ట బడింది. 1993 పే స్కేల్సు లో 10, 15, 22 సంగలకు బదులుగా 8, 16, 24 సంగల స్కేళ్లు ప్రవేశ పెట్టబడ్డాయి. ఆటోమాటిక్ అడ్వాన్సు మెంటు స్కేల్సులో ప్రవేశించినవారు ప్రమోషను పొందినపుడు FR22(B) కి బదులుగా FR22(a)(i) ప్రకారం వేతన స్థిరీకరణ చేయవలసి వుంటుందని పేర్కొన్నారు. 1999 పే స్కేల్సులో 24 సంగలు స్కేలు రద్దుచేసి, 24 సం॥ సర్వీసు పూర్తి చేసినందుకు గాను SPP-I స్కేలులోనే ఒక ఇంక్రిమెంటు అదనంగా ఇచ్చారు. 45 సం॥ వయస్సు దాటిన వార్కి G.O.Ms.No.225, తేది 18-5-99 ద్వారా డిపార్టుమెంటల్ టెస్టుల నుండి మినహాయింపు ఇచ్చారు.

కాగా 2005 లో 24 సం॥ SPP-II స్కేలు పునరుద్ధరించడంతోబాటు 8,16 స్కేళ్లు పొందినవారు ప్రమోషను పొందినపుడు FR-22(B) ప్రకారం వేతన స్థిరీకరించేందుకు అనుమతించారు అయితే 24 సం॥ స్కేలు పొందినవార్కి మాత్రం FR22(a)(i) ప్రకారమే వేతన స్థిరీకరణ చేయవలసివుంటుందని, SPP-I,SPP-II స్కేళ్లు పొందేవారు ఆ ప్రమోషను పోస్టుకు కావలసిన పూర్తి అర్హతలు సాధించవలసియుంటుందని స్పష్టం చేసారు.

ఆటోమాటిక్ అడ్వాన్సుమెంటు స్కీము వర్తించే ఉద్యోగుల గ్రేడులు 21 నుండి 25 వరకు అనగా 25600-50560 స్కేలు వరకు పెంచుతూ 9వ PRC కమిషన్ సిఫారసు మేరకు ప్రభుత్వం G.O.Ms.No.93 తేది 3.4.2010 ద్వారా ఉత్తర్వులు ఇచ్చింది. అంతేగాక ఆటోమాటిక్ అడ్వాన్సుమెంటు స్కీములో ప్రవేశించి ప్రమోషను పొందిన జూనియర్ల కంటే సీనియర్లు తక్కువ వేతనం పొందుతూంటే స్టెపప్ ద్వారా జూనియర్‌తో సమానంగా వేతనం పొందే సౌకర్యం పునరుద్ధరించబడింది. కాగా JAC తో కుదిరిన ఒప్పందం దృష్ట్యా నేడు 8,16,24 స్కేళ్లను 6,12,18,24 స్కేళ్లుగా మార్పుచేస్తూ రాష్ట్రప్రభుత్వం G.O.Ms.No.96, తేది 20.5.11 జారీ చేసింది. ఇది 1.2.2010 నుండి అమలులోకి వస్తుంది.

దీని ప్రకారం ఆటోమాటిక్ అడ్వాన్సుమెంటు స్కీములో ఒక కేటగిరిలో 6 సం॥ సర్వీసు పూర్తి చేసిన వార్కి (స్పెషల్ గ్రేడు పోస్టు స్కేలు), 12 సంగలు పూర్తిచేసిన వార్కి SPP-IA/ SAPP-IA స్కేల్సు, 18 సంగలు పూర్తి చేసిన వార్కి SPP-IB/ SAPP –IB స్కేల్సు, 24సంగలు పూర్తి చేసిన వార్కి SPP-II/SAPPII స్కేల్సు మంజూరు చేయబడతాయి.

(1) <u>స్పెషల్ గ్రేడు పోస్టు (SPP-I) స్కేలు :</u> ఒక పోస్టులో 6 సంగలు సర్వీసు పూర్తి చేసిన ఉద్యోగికి ప్రస్తుతము తాను పొందుతున్న స్కేలు తదుపరి స్కేలును స్పెషల్ గ్రేడు పోస్టు స్కేలుగా మంజూరు చేస్తారు.

(2) <u>స్పెషల్ ప్రమోషను పోస్టు స్కేలు:</u> దీనిని SPP-IA, SPP –IB అను రెండు భాగాలుగా విభజించారు.

ఎ) ఒకపోస్టులో 12 సంగలు సర్వీసు పూర్తి చేసిన ఉద్యోగికి తాను పొందబోవు తదుపరి ప్రమోషను పోస్టు స్కేలును SPP-I స్కేలుగా మంజూరు చేస్తారు. అయితే ప్రమోషను పోస్టుకు కావలసిన అర్హతలు ఉద్యోగి కలిగియుండాలి. 12 సంగలు సర్వీసు కలిగి, సర్వీసు రూల్సుననుసరించి తదుపరి ప్రమోషను లేని పోస్టులలో పనిచేస్తున్న వారికి స్పెషల్ గ్రేడు స్కేలు తదుపరి స్కేలును SAPP-I A స్కేలుగా మంజూరు చేస్తారు.

బి) ఒక పోస్టులో 18 సంగలు సర్వీసు పూర్తి చేసిన ఉద్యోగికి తాను పొందుతున్న SPP-IA/SAPP-IA స్కేలులోనే ఒక ఇంక్రిమెంటు అదనంగా మంజూరు చేస్తారు. దీనిని SPP-IB/SAPP-IB స్కేలుగా వ్యవహరిస్తారు.

**(3) స్పెషల్ ప్రమోషను పోస్టు స్కేలు -II (SPP-II)**

ఎ) ఒక పోస్టులో 24 సం॥లు సర్వీసు పూర్తి చేసిన ఉద్యోగికి సర్వీసు రూల్సు ప్రకారం తాను పొందబోవు రెండవ ప్రమోషను పోస్టు స్కేలునుSPP-II స్కేలుగా మంజూరు చేస్తారు. SPP II స్కేలు పొందు ఉద్యోగి తాను రెగ్యులర్ విధానంలో పొందవలసిన ప్రమోషను పోస్టుకు కావలసిన పూర్తి అర్హతలు కలిగియుండాలి.

బి) ఒక వేళ SPP-I స్కేలు పొందుతున్న ఉద్యోగికి 2వ ప్రమోషను పోస్టు లేని సందర్భములో SPP-I స్కేలు తదుపరి స్కేలును SPP-II స్కేలుగా మంజూరు చేస్తారు. అట్లే SAPP-I స్కేలు పొందుతున్న ఉద్యోగికి, దాని తదుపరి స్కేలును SPP-II స్కేలుగా మంజూరు చేస్తారు.

**అర్హతలు:** SGT తత్సమాన కేడర్లవారు SPP-I (12 సం॥) స్కేలు పొందుటకు Inter, TTC అర్హతలు కలిగియుండాలి. 24 సం॥ స్కేలు పొందుటకు Degree,B.Ed., అర్హతలతోబాటు E.O.G.O., టెస్టులు పాసయి ఉండాలి. గ్రేడు - II పండితులు 24 సం॥ స్కేళ్ల కొఱకు 10వ తరగతి మరియు 5సం॥ల రెగ్యులర్ కోర్సులో చేసిన డిగ్రీ / పండిట్ ట్రైనింగు పూర్తి చేసియుండాలి. స్కూలు అసిస్టెంట్లు ఏ కేడరు వారైనా 24 సం॥ స్కేలు పొందుటకు డిగ్రీ, బి.యి.డి. అర్హతలతోబాటు E.O.G.O., టెస్టులు పాసయి ఉండాలి.

**వేతన స్థిరీకరణ విధానం:** ఆటోమాటిక్ అడ్వాన్సుమెంటు స్కేళ్లలో FR 22 (a) (i) read with FR 31 (2) ప్రకారం వేతన స్థిరీకరణ చేస్తారు. 6,12,18 స్కేళ్లు పొందుతూ ప్రమోషన్ పొందినవారికి ప్రమోషను పోస్టులో FR 22 (B) పకారం వేతన స్థిరీకరణ చేస్తారు. 24 సం॥లు స్కేలు పొందుతూ ప్రమోషను పొందినవారికి FR 22 (a) (i) read with FR 31 (2) ప్రకారం వేతనం స్థిరీకరిస్తారు. అయితే ప్రమోషను పోస్టులో 6,12,18 స్కేళ్లు మాత్రం మంజూరు చేయరు.

ఈ నిబంధనలు 1.2.2010 నుండి వర్తిస్తాయి. 1.2.2010కు ముందే 12,18 సం॥లు సర్వీసు పూర్తి చేసినా, ఆ స్కేళ్లు 1.2.2010న మాత్రమే మంజూరు చేస్తారు. 01.02.2010 తర్వాత 8,16 సం॥స్కేళ్ళు పొందినవారు తమ స్కేళ్లకు 01.02.2010 నాట్కి 6,12 సం॥స్కేళ్లుగా రివైజు చేసుకోవాలి. 1.2.2010 నుండి 31.5.2011 వరకు రావలసిన అరియర్లు ఉద్యోగి ఫి.యఫ్., సి.పి.ఎస్. ఖాతాలకు జమచేస్తారు. అట్లే 01.02.2010కు ముందు 16 సం॥ స్కేలు తీసుకొని 01.02.2010 తర్వాత 18 సం॥ సర్వీసు పూర్తిచేస్తే అట్టివారికి SPP-IB / SAPP-IB స్కేళ్లు వర్తిస్తాయి. 24 సం॥ స్కేలు పొందలేకపోయినవారు 18 సం॥ స్కేలు పొందే అవకాశం వుంది.

ఆటోమేటిక్ అడ్వాన్స్‌మెంట్ స్కీమును 8,16,24 సం॥ స్కేళ్ల నుండి 6,12,18,24 సం॥ స్కేళ్లుగా మార్పు చేయడాన్ని UTF స్వాగతిస్తున్నది. అయితే జి.ఓ.93లో ఇచ్చిన స్టెపప్ సౌకర్యం, ఉద్యోగి నియామకం పొందిననాట్కి సర్వీసురూల్సు ఆధారంగా ఆటోమాటిక్ అడ్వాన్స్‌మెంటు స్కీము వర్తింపు విషయాలు జి.ఓ.96లో చోటుచేసుకోలేదు. 6,12,18,24 సం॥ స్కేళ్లలో కూడా స్టెప్‌అప్ సౌకర్యాన్ని కొనసాగించాలని, ప్రమోషన్ల సందర్భంలో ఇస్తున్న వయోపరిమితి రాయితీని ఆటోమాటిక్ అడ్వాన్స్‌మెంట్ స్కీములో కూడా వర్తింపచేయాలని UTF డిమాండు చేస్తున్నది.

| కేటగిరి | ఆర్డినరీ స్కేలు | స్పెషల్ గ్రేడు | మొదటి ప్రమోషను స్కేలు | | రెండవ ప్రమోషను పోస్టు స్కేలు | |
|---|---|---|---|---|---|---|
| | | | SPP-I | SAPP-I | SPP-II | SAPP-II |
| ఎస్.జి.టి. తత్సమాన కేడర్లు | 10900-31550 | 11530-33200 | 14860-39540 | 11860-34050 | 18030-43630 | 15280-40510 |
| స్కూలు అసిస్టెంట్లు | 14860-39540 | 15280-40510 | 18030-43630 | 16150-42590 | 18030-43630 | 18030-43630 |
| గ్రేడు -II HM's | 18030-43630 | 19050-45850 | 19050-45850 | 19050-45850 | 21820-48160 | 20680-46960 |

****